అంతా వ్యాపారమే

శ్రీ బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు

రామనాథం ఢిల్లీ విమానాశ్రయంలో దిగి, క్వీన్స్ హోటల్‌కి టెలిఫోను చేశాడు, తనకో గది ఏర్పాటు చెయ్యమని.

క్వీన్స్ హోటల్ చాల పెద్దతరగతి హోటేలు. అతి విశాలమైన ఆవరణ, ఆవరణలో పూలతోట, చుట్టూ ప్రహారీగోడ, ఇనపగజాల తలుపులు, సింహద్వారంవద్ద గూర్ఖావాడు. దూరంనుంచి చూస్తే ఆంగ్లేయ వాస్తు శిల్ప పద్ధతిలో కట్టిన యీ భవనం రాజులూ, రాణీలు నివసించే ప్రాత రకపు భవనంలా కనిపిస్తుంది. దాని కొక విఘ్నమైన గంభీరాకారం వుంది

దీని పేరు భారతదేశంలోనే కాక విదేశాల్లో కూడా వ్యాపించింది. విలాసార్థం భారతదేశ యాత్రకు వచ్చే విదేశధనికులు, స్వదేశ ధనికులు, రాజ ప్రముఖులు, రాయబారులు, పెద్దపెద్ద వ్యాపారులు వగైరా శ్రీమంతులు అక్కడ దిగుతారు

మేనేజరు భారతీయుడే కాని ఆంగ్ల నాగరికత బాగా వొంటపట్టినవాడు. కొంచెం స్థూలకాయుడు. పొట్టిగా గుమ్మడికాయలా వుంటాడు. బట్టతల, నల్లటి ముఖంలోంచి తెల్లటి పలువరుస తొంగి చూస్తూ వుంటుంది. ఆ కళ్ళలో నిశితమైన దృష్టి, నిర్వహణసామర్థ్యం, జీవితానుభవం వుట్టిపడుతూ వుంటాయి.

రామనాథానికి మంచిగదొకటి ఏర్పాటు చేశాడు మేనేజరు. తనకొచ్చిన వివరాల ప్రకారం రామనాథం ఒక పెద్ద వ్యాపారస్తుడు. వ్యాపారంమీద విదేశాలు తిరిగినవాడు. ప్రభుత్వ వర్గాల్లో బాగా పలుకుబడి వున్నవాడు. ఆయన ఢిల్లీ వస్తున్నాడంటే ఎవరైనా మంత్రులనో, పెద్ద వుద్యోగులనో కలుసుకోడానికే అయివుండవచ్చును. ఆయన కేలోపం జరగకూడదని బంట్రోతులకూ గుమాస్తాలకూ చెప్పివుంచాడు. అతని రాకకోసం ఎదురు చూస్తున్నాడు. తను స్వయంగా స్వాగతమివ్వడమే బాగుంటుంది. మధ్యాహ్నం ఒంటిగంటైంది, మేనేజరుకి ఆకలివేస్తూంది, మరో పావుగంటమాసి భోజనానికి పోవచ్చుననుకున్నాడు మేనేజరు

అంతల్లో గుమ్మంలో కారు నిలబడింది. రామనాథం కారు దిగి చకచక మెట్లెక్కి హాలులోకి వచ్చాడు. కొంచెం పొడుగ్గా, తెల్లగా అందంగా వుంటాడు. చాల విలువైన ఫ్రెంచి ఉన్ని సూటు, స్విస్ వై, కళ్ళజోడు, నోట్లో పైపు, చేతిలో తోలు సంచీ, కెమేరా. హోటలు బంట్రోతులు వచ్చి సలాంపెట్టి పెట్టె బెడ్డింగూ లోపలికి తీసుకువెళ్ళేరు. మేనేజరు వినయపూర్వకంగా వంగి కరచాలనం చేశాడు. పరిచయాలు చేసుకున్నారు

“మేనేజర, మీ హోటల్‌కి రావడం నాకు సంతోషంగా వుంది” అన్నాడు రామనాథం ఇంగ్లీషులో. అలా అనడం సంప్రదాయం కాబోలు మరి

“మీ కన్నివిధాలా సదుపాయంగా వుండేటట్లు చూస్తాను” అన్నాడు మేనేజరు. ఈ ఆనవాయితీలయిన తరవాత వాళ్ళిద్దరూ రామనాథంకోసం ఏర్పాటు చేసిన గదిలోకి వెళ్ళేరు. గదిలో రేడియో, టెలిఫోను, డ్రెస్సింగ్ టేబులు, సోఫాలు వగైరా సామగ్రి వుంది.

“మీకేమైనా అవసరముంటే ఆఫీసులో వుంటాను టెలిఫోను చెయ్యండి” అన్నాడు మేనేజరు.

“అలాగే ”

“మీరు ప్రయాణపు బడలికతో వున్నట్టున్నారు, స్నానం, భోజనం చేసి విశ్రాంతి తీసుకోండి. మళ్ళీ సాయంత్రం కలుద్దాం ”

“చూడండీ, పోస్టాఫీసునుంచి ఒక వంద టెలిగ్రాం ఫారాలు తెప్పించండి, చాలా పని వుంది” అన్నాడు రామనాథం

అలాగేనని చెప్పి మేనేజరు వెళ్ళిపోయాడు.

సాయంత్రం రామనాథ్ ఊళ్ళో కెళ్ళి అటూ యిటూ తిరిగి హోటలుకి చేరుకునేసరికి చీకటి పడింది. హోటలు విద్యుద్దీపాలతో పట్టపగలులా వుంది. జట్లు జట్లుగా స్త్రీ పురుషులు కార్లలోంచి దిగి విలాసంగా నడుస్తూ మాట్లాడుకుంటూ, గట్టిగా నవ్వుకుంటూ లోపలికి వెళ్తున్నారు. హోటలు హాలులోంచి సంగీతం, వీధి వరండామీద స్త్రీల కిలకిల నవ్వులూ ఆవరణ అంతా వ్యాపించాయి. విద్యుద్దీపాల కాంతిలో స్త్రీల దుస్తులు, ఆభరణాలు తళతళ మెరుస్తున్నాయి,

రామనాథం వరండాను దిగువ ఆవరణలో వేసివున్న ఒక కుర్చీలో కూర్చుని తీరికగా పైపు కాలుస్తున్నాడు. హోటల్ లోపలికి వెళ్ళేవారినీ అక్కడే తచ్చాడుతున్నవారినీ చూస్తున్నాడు. హాలులోని నిలువుటద్దాలలో వారి ప్రతిబింబాలు కనిపిస్తున్నాయి. వారంతా గొప్ప కుటుంబాలకు చెందినవారు భూస్వాములు, వర్తకులు, అధికారులు, ధనికులు. వారి నడకల్లోనూ, కదలికల్లోనూ తాము భాగ్యవంతులమనే, అదృష్టవంతులమనే భావం కనిపిస్తూంది. స్త్రీలలో అందంగా వున్నవాళ్లూ, వికారంగా వున్నవాళ్లూ కూడా వున్నారు కాని వారంతా చక్కగా ముస్తాబయారు. వారి చూపుల్లో, మాటల్లో పురుషులను ఆకర్షించాలనే లక్ష్యం కనిపిస్తుంది. స్త్రీలు కూడా లోపలికి వెళ్ళి తాగుతున్నారు. బాల్‌రూమ్‌లో జంటలుగా నాట్యం చేస్తున్నారు. హుషారుతో, వుద్రేకంతో తుళ్లుతున్నారు అలసిపోయినవారు సోఫాల్లో చతికిలబడి, కొంచెం షాంపైన్, లేకపోతే గిమ్లెట్ పుచ్చుకుంటున్నారు. వైలెన్ మీద బిథోవెన్ సంగీతం హాయిగా వుంది దాని ప్రక్క పియానోవాయిద్యం కూడా బాగుంది. అంతా తుఫానులా, సముద్రపు హోరులా వుంది

రామనాథానికి జీవితం ఎంతో ఆనందమయంగా తియ్యగా కనిపించింది. ఈ సుఖాలను అందుకోడానికి మనిషి ఎంతో అదృష్టవంతుడై పుట్టాలి లేదా సమాజాన్నీ జీవితాన్నీ తన పిడికిట్లో పెట్టుకుని, అనేకమందినీ, అవరోధాలనూ జయించుకు వచ్చి అదృష్టాన్ని సృష్టించుకోవాలి. లేకపోతే జీవితసార్థక్యం ఏమిటి? రామనాథం ఆలోచిస్తున్నాడు వెనకనుంచి మిసెస్ స్మిత్ వచ్చింది ఆమె ఆంగ్లో యిండియన్ స్త్రీ వయసు మళ్లినప్పటికీ యవ్వనిలా వుండడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నట్టు కనిపిస్తుంది “నీకోసం లోపలంతా వెదికాను. నాట్యానికి రావా?” అంటూ పక్కనున్న కుర్చీలో కూచుంది. ఆమె నోరు బ్రాందీ వాసన కొడుతూంది. అప్పుడప్పుడు పెదిమలు చప్పరిస్తూంది బ్రాందీ వల్ల మండుతున్నాయి కాబోలు.

అంతల్లో మేనేజరు గబగబా వచ్చి మంచి ప్రోగ్రాం ఏర్పాటుచేశాము. చాకాలమైంది, ఇండియన్ డాన్స్ చూలేదని చాలమంది అన్నారు, అంచే ప్రత్యేకంగా కలకత్తానుండి ఒక పార్టీ తెప్పించాము. లోపలికి దయచెయ్యండి అన్నాడు

“ఇండియన్స్‌కి డాన్సేమిటి, నా మొహం! నృత్యకళ అంటే ఫ్రాంసులో చూడాలి. నేను పేరిస్‌లో వున్నప్పుడు..

(49 వ పేజీ చూడండి)

అంతా వ్యాపారమే

(11వ పేజీతరువాయి)

అని ఏదో చెప్పబోయాడు రామనాథం. కాని దొరసాని అడ్డుతగిలింది.

"అదేమిటి మోహన్ అలా అంటావు. భారతీయనాట్యం చాల గొప్పది. నాకెంతో యిష్టం. మీ భరతనాట్యంలో గొప్ప కళ వుంది"

రామనాథం చిరునవ్వు నవ్వి "నిజమే కాని, యీ మామూలు డాన్సర్లందరూ శాస్త్రయుక్తంగా నాట్యం చెయ్యలేరు. వీరు చవకబారు నృత్యాలతో భారతీయ సంస్కృతికీ, కళలకూ అపచారం చేస్తున్నారు, భారతీయ నాగరికతనూ, సంస్కృతినీ పాడుచేస్తున్నారు" అని రామనాథం ఒక్క గ్లాసు స్కాచి విస్కీ పుచ్చుకున్నాడు.

"నిజమే మోహన్, ఏ దేశంలోనైనా అంతే. కాబట్టే ప్రభుత్వం చవకబారు కళాకారుల్ని నిషేధించాలంటూ వుంటాను" అంది మిసెస్ స్మిత్. కళాకారుల్ని నిషేధించడమేమిటో మేనేజరుకి బోధపడలేదు. అసలీ దొరసాని ఎవరో, రామనాథాన్ని మోహన్ అని ఎందుకు పిలుస్తూందో, అర్థంకాలేదు. అతనికంతా అగమ్యగోచరంగావుంది. "క్షమించండి, మీరెవరో పరిచయం చేయలేదు" అన్నాడు రామనాథంతో.

"ఓ, సారీ, యీమె మిసెస్ స్మిత్ నా స్నేహితురాలు. మోహన్ అన్నది మా తండ్రిగారు నాకుపెట్టిన ముద్దుపేరు," అన్నాడు రామనాథం. 'ఏడిసినట్టుంది' అనుకున్నాడు మేనేజరు. ఇంతట్లో యింకో యువకుడు తూలుకుంటూవచ్చి వారి ప్రక్కనున్న కుర్చీలో కూచున్నాడు. అతని కళ్లు ఎర్రగా చింతనిప్పుల్లా వున్నాయి. ద్రాక్షసారా అతని కోటు కాలరుమీదపడి మరకట్టింది అతనేరామనాథాన్ని పలకరించాడు.

"హల్లో మిస్టర్ రావ్ ఎప్పుడు కలకత్తానుండి రావడం?"

"లేదు, లేదు. నే నిప్పుడు బొంబాయిలో వుంటున్నాను మిస్టర్ మేనేజరు, ఈయన నా మిత్రుడు డేవిడ్; నామిత్రులు కాలేజీక్లాసుమేట్లు నన్ను రావ్ అని పిలుస్తూవుంటారు" అన్నాడు. ఒక మనిషికి యిన్ని పేర్లుండడ మేమిటని ఆలోచిస్తున్నాడు మేనేజరు. వాళ్లందరితో కరచాలనం చేసి వెళ్లిపోయాడు. వారంతా కూడా లేచి లోపలికి వెళ్లేరు.

మర్నాడు డేవిడ్ హోటలు మేనేజరు దగ్గర కొచ్చి రామనాథం యింకా వూళ్లో ఎన్నాళ్ళుంటాడని అడిగాడు. మేనేజరు, ఎందుకన్నాడు. రామనాథం తనదగ్గిర అయిదు వందలు అప్పు తీసుకున్నాడని చెప్పేడు.

"ఆయన అప్పు చెయ్యవలసిన కర్మమేమిటి?"

"ఇవాళే నాకు తెలిసింది. రామనాథం వ్యాపారం దివాలాఅయిందిట. ఇప్పుడు ప్రగల్భాలు చెప్పుకుతిరుగుతున్నాడట. ఈవూళ్లో తెలిసిన వాళ్లదగ్గర అప్పుడే అప్పులు చేశాడట. అతను తీర్చగలడనే నమ్మకంలేదు." అన్నాడు డేవిడ్. మేనేజరుకి యిదంతా అగమ్యగోచరంగా వుంది. డేవిడ్ వెళిపోయాడు. రామనాథం ఎటువంటి వాడై వుంటాడా అని ఆలోచిస్తూ కూర్చున్నాడు మేనేజరు.

ఆ సాయింకాలం రామనాథం మేనేజరు దగ్గరకొచ్చి "మిస్టర్ మేనేజరు నేనింకా యీ వూళ్ళో వారం పదిరోజులుండాలి. ఇటూ అటూ వెళ్ళడానికి తక్షణం ఒక కారుకావాలి ఎవరేనా కార్ల కంపెనీ వాళ్లకి కబురుపెడతారా" అని అడిగాడు. ఇతనుండే వారం పదిరోజులకూ కారు కొనడమెందుకో మేనేజరుకు అర్థంకాలేదు. ఎంత లక్షాధికారైనా టాక్సీలో పోతాడుగాని, వారం రోజులకోసం పది పదిహేను వేలుపెట్టి కారుకొనడు. సరే యిదేదో చూదామని 'సరే' నన్నాడు.

కార్ల కంపెనీకి కబురువెళ్ళగా, వాళ్లు రావడం, రామనాథం వాళ్లదగ్గర కారొకటి తీసుకుని పదిహేనువేలకు చెక్కు వ్రాసి యివ్వడం జరిగింది.

మర్నాడు పగలల్లా రామనాథం హోటలుకు రాలేదు. సాయింత్రం వచ్చాడుగాని పేకాడడానికిగాని, వినోదకార్యక్రమానికిగాని రాలేదు. సరాసరి తన గదిలోకి వెళ్ళిపోయాడు

రాత్రి తొమ్మిదిగంటలకి ఎవరో యిద్దరు మనుషులు రామనాథం గదిలోంచి రావడం చూశాడు మేనేజరు వాళ్ళని కలుసుకుని, తన గదిలోకి తీసుకువెళ్ళి, పానీయాలు యిప్పించి, ఏం పనిమీద వచ్చారని అడిగాడు. వాళ్లు రామనాథం దగ్గర 12 వేలకు కారు కొనుక్కున్నామని చెప్పి రసీదు చూపించారు. కారు తీసుకుపోతామని చెప్పేరు. తరవాత కారు తీసుకుపోయారు కూడాను.

మేనేజరు కిదంతా ఏమిటో అంతు చిక్కడంలేదు. రామనాథం నిన్ననే కారు కొని యివాళ మూడు వేలు నష్టానికమ్మేడు. డేవిడ్ చెప్పింది నిజమై వుండవచ్చును. అసలు మొదటినుంచీ యీ మనిషి వ్యవహారం విచిత్రంగానే వుంది. ఈ రోజుల్లో ఎవడు పెద్దమనిషో, ఎవడు మోసగాడో తెలుసుకోవడం చాల కష్టం. హోటల్ మేనేజరయిన తరవాత ఇటువంటి చిక్కుసమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది మరి. రకరకాల మనుషులు వచ్చి దిగుతారుకదా. సరే రేపు చూసుకోవచ్చు ననుకున్నాడు మేనేజరు.

మర్నాడు ఉదయం రామనాథం మేనేజరుదగ్గరి కొచ్చి హోటేలు బిల్లు చెల్లించి, పది గంటలకి విమానంలో బొంబాయి వెళిపోతున్నానని చెప్పేడు. ప్రయాణానికి సన్నాహం చేయడం మొదలెట్టేడు.

మేనేజరుకి తన అనుమానం రూఢి అయింది. లేకపోతే హఠాత్తుగా యీ ప్రయాణ మేమిటి? తను చేసిన పని నలుగురికీ తెలిసి పట్టుబడేలోగా వూళ్లోంచి దాటేస్తున్నాడు.

మేనేజరు వెంటనే మోటారు కారు కంపెనీకి టెలిఫోను చేసి రామనాథం యిచ్చిన చెక్కు మారిందా లేదా అని అడిగాడు. జరిగిన సంగతంతా చెప్పి, అతను పదిగంటలకి వెళ్లిపోతున్నాడని చెప్పేడు.

కార్ల కంపెనీవాళ్లు వెంటనే పోలీసు స్టేషన్‌కు వెళ్ళి జరిగిన కథంతా చెప్పేరు. రామనాథం యిచ్చిన చెక్కునుగురించి బ్యాంకులో దర్యాప్తు చేశారు. రామనాథానికి బ్యాంకులో ఎకౌంటు వుందో లేదో తెలుసుకోడానికి బొంబాయికి రాశామని, దాని బ్రాంచీ ఢిల్లీలో లేదనీ, టెలిగ్రాం యిచ్చినా జవాబు రావడానికి ఒక రోజు పట్టవచ్చునని బ్యాంకువాళ్లు చెప్పేరు.

అయితే చూస్తూ చూస్తూ మనిషిని విడిచిపెడితే ఎలాగ? అసలు వ్యవహారమంతా చూస్తూ వుంటే వీడు మోసగాడిలాగే కనిపిస్తున్నాడాయెను. కార్ల కంపెనీవాడు రామనాథాన్ని ఎరెస్టుచెయ్యాలని పట్టుబట్టేడు.

మొత్తంమీద రామనాథాన్ని పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్ళడం, ప్రశ్నించడం జరిగింది. ఆ రోజంతా అతన్ని పోలీసు స్టేషన్‌లోనే వుంచారు.

మర్నాడు బ్యాంకునుండి వర్తమానం వచ్చింది. రామనాథానికి బొంబాయిలో ఒక బ్యాంకులో 65 వేల రూపాయ లున్నాయట. చెక్కు సరియైనదేననీ, దానిని మోటారుకార్లకంపెనీ ఎకౌంటుకు జమ కడుతున్నామనీ బ్యాంకువాళ్ళు చెప్పేరు.

రామనాథం దర్జాగా మళ్ళీ హోటల్‌కి వచ్చి మకాం పెట్టేడు. మేనేజరు జరిగిన దానికి మనసులో పశ్చాత్తాప పడ్డాడు

అయితే రామనాథం యిక్కడితో వూరుకుంటే రామనాథ మెలా అవుతాడు. అతను వెంటనే ప్లీడర్ని పిలిచి, తన పరువునష్టానికి ప్రయాణం ఆగిపోయినందుకు వ్యాపారం నష్టమయిందనీ మోటారుకంపెనీమీద 50 వేలకు దావా వేసి గెలుచుకున్నాడు. ★